# నాణెమైన చరిత్ర



సేకరించిన నాణేలను చూపుతున్న దిలీప్ కుమార్ జైన్

**నేటి వార్త రేపటి చరిత్ర. కాల గమనంలో మార్పులు సహజం. ఆయా కాలాల్లోని చరిత్ర భావితరాలకు తెలియ చెప్పాలనేదే ఈ యువకుని తపన. ఇందుకోసం ఆయన దేశ సంచారం చేశారు. ఆయన ఎంచుకున్న మార్గం పురాతన కాలం నాటి నాణేల సేకరణ. తన వద్ద ఉన్న చరిత్ర భాండాగారంలో పురాతన నాణేలను భద్రపరిచారు. వీటికోసం తన అన్వేషణ నిరంతరం సాగుతుందని ఆయన చెబుతున్నారు.**



అక్బర్ కాలం నాటి నాణెం

గుమ్మడిపూండి, న్యూస్‌లైన్ :

గుమ్మడిపూండికి చెందిన 23 ఏళ్ల యువకుడు దిలీప్ కుమార్‌జైన్. ఈయన 15 ఏళ్లుగా పురాతన భారత సామ్రాజ్యం. చరిత్రను పుస్తకాల్లో చదవడం అలవాటుగా మార్చుకున్నారు. ఆయన తండ్రి బంగారు ఆభరణాల దుకాణం నిర్వహిస్తున్నారు. ఇది దిలీప్‌కుమార్ మదిలో సరికొత్త ఆలోచనలకు పురిగొల్పింది.

**నాణేల సేకరణలో....**

తన ఆశయాలకు జీవం పోయడానికి ఆయన కుటుంబ సభ్యుల ప్రోత్సాహంతో దేశ సంచారం చేశారు. పలు పురావస్తు శాఖలు సందర్శించి, చరిత్రకారులను కలిశారు. వారి సహకారంతో రాజుల కాలం నాటి పురాతన నాణేలు సేకరించడం లక్ష్యంగా చేసుకున్నారు. అలా ఆయన నాణేల సేకరణ ప్రారంభమైంది.

**ఆయన గుప్పిట్లో చరిత్ర ...**

దిలీప్‌కుమార్ సేకరించిన నాణేలు చూడడానికి చాలా తక్కువ సమయం పడుతుంది. అందులో ఎలాంటి సందేహం లేదు. అయితే వాటిని సేకరించడానికి ఎంత తాపత్రయం, శ్రమ పడ్డారనేది ఆయన గుప్పిట్లో ఉన్న చరిత్రే సమాధానం చెబుతుంది. 15 వ శతాబ్దం నుంచి చివరగా దేశాన్ని పాలించిన ఆంగ్లేయుల పాలన కాలం నాటి వరకు అమలులో ఉన్న నాణేలు ఆయన సేకరించారు. ఇందులో చోళులు, చంద్రగుప్తులు, మౌర్యులు, పాండ్యులు, మహమ్మదీయులు, శ్రీకృష్ణదేవరాయలవారి కాలం నాటి నాణేలు దాదాపు 500 వరకు సేకరించారు. ఇందులో ప్రత్యేకించి విజయనగర సామ్రాజ్య కాలానికి చెందిన, ప్రపంచంలోనే అతితక్కువ బరువు గల డాలర్లు ఆయన చరిత్ర భాండాగారంలో ఉన్నాయి.

**అన్వేషణ ఆగదు**

పురాతన నాణేల కోసం నా అన్వేషణ ఆగదు. ప్రభుత్వం సహకారం అందిస్తే నా సంచారం ఇంకా వేగం చేస్తా. చరిత్రను భావితరాలకు అందించాలనేదే నా తపన. ఇందుకోసం వివిధ సామ్రాజ్యాధీశుల పరిపాలనకు చెందిన నాణేలు సేకరించడానికి నా పయనం కొనసాగిస్తా.

\- దిలీప్‌కుమార్